నవతెలంగాణ
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
బుధవారం | 20 డిసెంబర్ 2023 | www.navatelangana.com

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-కోహిర్



ఎదురెదురుగా వచ్చిన రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన కోహిర్ సంజీవ్‌నగర్ సమీపంలో మంగళవారం జరిగింది. ఎస్సై విఠల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గురుజువాడ గ్రామానికి చెందిన బ్యాగరి గోపాల్(50) తన బైక్‌పై పైడి గుమ్మల్ గ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో కోహిర్ సంజీవ్‌నగర్ కాలనీ సమీపానికి రాగానే.. ఎదురుగా వస్తున్న మరో బైక్ బలంగా ఢీ కొట్టింది. దాంతో తీవ్ర గాయాలై గోపాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య మానెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రైతు దినోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

నవతెలంగాణ-సంగారెడ్డి



ఈనెల 23న ఉదయం 11.30గంటలకు రైతు దినోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ మంజీరా రైతు సమాఖ్య సభ్యులు పిలుపు నిచ్చారు. ఈ మేరకు ఈ కార్యక్రమ విధివిధానాలపై మంగళవారం చర్చించారు. ఈ కార్యక్రమంలో సంగశెట్టి, వెంకట్ రావు, జైపాల్ జాలిల్ రవీందర్, అశోక్, ఎం. భర్తప్ప కోరారు.



'ఎఫ్ఎల్ఎన్'పై అదనపు కలెక్టర్ సమీక్ష

నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న ఎఫ్ఎల'ఎన్ పురోగతి, ఎదురవుతున్న ఇబ్బందులను జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మంగళవారం మండల విద్యాధికారులు, నోడల్ అధికారులు, డీఆర్‌పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన ఊరు మనబడి పాఠశాలను ఆధారంగా ఎంపిక చేసు కొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి వాటిని ఆదర్శంగా మిగతా పాఠశాలలో ప్రమాణాలను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంక'టేశ్వర్లు, సెక్టోరియల్ అధికారి అనురాధ పాల్గొన్నారు.

పబ్లిక్ బోర్ ప్రజలకే చెందాలి



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని గాంధీనగర్‌లో గల పబ్లిక్ బోరు ప్రజలకే చెందాలని ఒకటో వార్డు కౌన్సిలర్ పెద్దదొడ్డి చంద్రయ్య డిమాండ్ చేశారు. బోరు కబ్జా చేసిన వారితో మున్సిపల్ కమిషనర్ కుమ్మక్కయ్యారని ఆరోపించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడ ుతూ.. గాంధీనగర్లో నీటి ఎద్దడిని తీర్చడానికి బోర్ వేశారని.. అయితే ఓ వ్యక్తి బోరును సైతం ఆక్రమించి వాటర్ ప్లాంట్ పెట్టుకొని నీటిని అమ్ముతున్నాడని ఆరోపించారు. దీనిపై గతంలో మున్సిపల్ కమిషనం కి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. బోర్ కబ్జా చేసిన వ్యక్తులతో కమిషనర్ కుమ్మక్కయ్యారని ఆరోపించ'ారు. తాము దళితులమని చిన్నచూపు చూస్తున్నారని.. ముఖ్యంగా గాంధీనగ'ర్‌లోని ప్రజలు నీటి సమస్యతో అల్లాడుతున్నారన్నారు. వెంటనే బోరును ప్రజలకు చెందేటట్లు న్యాయం చేయాలని కమిషనర్‌కు, జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో గాంధీనగర్ వాసులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

'క్రషింగ్' హామీ నెరవేరేదెన్నడో?

ఎన్నికల్లో ప్రచార అస్త్రంగా ట్రైడెంట్ పరిశ్రమలో చెరకు క్రషింగ్..

- ఒకరిని మించి మరొకరి హామీ.. ప్రారంభించే బాధ్యత తమదేనంటూ భరోసా
- కొత్త ప్రభుత్వం ఏర్పాటై అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నా.. అమలుకు నోచుకోని వాగ్దానం
- చెరకు రైతుల్లో ఆందోళన
- వెంటనే ప్రారంభించాలని వేడుకోలు



ఇటీవలే జరిగిన శాసనసభ ఎన్నికల్లో జహీరాబాద్ నియోజకవర్గానికి సంబంధించి ట్రైడెంట్ చక్కెర పరిశ్రమ క్రషింగ్ హాట్ టాఫిక్‌గా మారింది. ఈ నియోజకవర్గంలో చెరకు రైతులు అధికంగా ఉండడంతో.. అభ్యర్థులందరూ చెరకు క్రషింగ్‌నే ప్రచార అస్త్రంగా మలుచుకున్నారు. ట్రైడెంట్ పరిశ్రమలో గానుగ ఆడించి.. క్రషింగ్‌ను ప్రారంభించే బాధ్యత తమదంటే తమదని హామీలిచ్చారు. కానీ ఎన్నికలు అయిపోగానే ఆ హామీని గాలికొదిలేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన చంద్రశేఖర్ సైతం పలు దఫాలుగా పరిశ్రమ గేటు వద్దకు వచ్చి.. వచ్చేది తమ ప్రభుత్వమేనని, చెరకు రైతులు ఆందోళన చెందొద్దని భరోసానిచ్చారు. క్రషింగ్ ప్రారంభించడమే కాకుండా.. బకాయి డబ్బులు కూడా చెల్లిస్తామని వాగ్దానం చేశారు. అయితే తాను ఓడిపోయినప్పటికీ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టినా ఈ హామీ మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. పంట కోతకు వచ్చిందని ఆలస్యం చేస్తే ఎండిపోయే ప్రమాదముంటుంది కాబట్టి.. వెంటనే క్రషింగ్ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ జోన్ పరిధిలో కోహిర్, న్యాలకల్, మొగుడంపల్లి, ఝరాసంగం, రాయికోడ్ మండలాల పరిధిలో 18 వేల ఎకరాల్లో రైతులు చెరకు పంటను సాగు చేస్తున్నారు. అందులో సుమారు 7 లక్షల టన్నుల పైనే చెరకు దిగుబడి వస్తుందని అంచనా. అయితే ప్రస్తుతం పంట కోతకు వచ్చినప్పటికీ.. పరిశ్రమ ప్రారంభానికి నోచుకోకపోవడంతో కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ పరిశ్రమలకు చెరకును రైతులు తరలిస్తున్నారు. ఆయా పరిశ్రమల వారు టన్నుకు రూ.2,680 మాత్రమే.. చెల్లించి ట్రాన్స్‌పోర్ట్, హార్వెస్టింగ్ భరిస్తున్నారు. దాంతో ఆయా పరిశ్రమల్లో చెరకును విక్రయించుకునేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ నేవ ధ్యంలో అధికంగా చెరకు తరలివ స్తుండడంతో.. మద్దతు ధరను తగ్గించే ఆస్కారం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. సరైన సమయంలో గానుగాడిస్తే తగిన మోతా దులో దిగుబడి వచ్చి రైతులకు గిట్టుబాటు వస్తుందని.. ఎండలు తీవ్రమైతే చెరకు పంట ఎండిపోయి దిగుబడి సరైన విధంగా రాదని రైతులు వాపో తున్నారు. చెయకును ఇతర ప్రాంతాలకు తరలించేందుకు నూతన ప్రభుత్వం కనీస బాధ్యత కూడా తీసుకోకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోం దని ఆ ఏ దన వ్యక్తం చేస్తున్నారు. ఆర్డీఓ గతంలో రైతులతో చర్చలు జరిపి.. చెరకును ఎక్కడికైనా విక్రయించుకోవచ్చని, జోన్ పరిధి నిబంధనలు ఏమీ లేవని చెప్పారన్నారు. అల'ాగే గానుగాడించేందుకు ప్రభుత్వపరంగా చర్యలు చేపడతామని హామీని ఇచ్చినా.. అమలుకు మాత్రం నోచుకోలేదన్నారు.



ఎన్నికల ముందు పరిశ్రమ ఎదుట రైతుల ఆందోళన..

రూ.9 కోట్ల బకాయిలు వచ్చేనా?

గత సీజన్ 2022-23కు సంబంధించి 2.55 టన్నుల చెరకును ట్రైడెంట్ పరిశ్రమలో గానుగాడించారు. అందుకు సంబంధించి టన్నుకు రూ.3,270 మద్దతు ధరను నిర్ణయించారు. అయితే నేటికీ టన్నుకు రూ.3వేలు మాత్రమే చెల్లించారని.. మిగతా రూ.270 పెండింగ్‌లో ఉన్నాయని రైతులు వాపోతున్నారు. ఇందుకు సంబంధించి రైతులకు ట్రైడెంట్ పరిశ్రమ రూ.9 కోట్లు బకాయి ఉన్నది. జోన్ పరిధిలో మొత్తం 2387 మంది రైతులు ఉండగా.. అందులో 1699 మంది రైతులకు రూ.270 చొప్పున చెల్లించాల్సి ఉందనీ అధికారులు చెబుతున్నారు. రైతులకు మొత్తం రూ.83 కోట్ల గాను రూ.74 కోట్లు మాత్రమే చెల్లించారని.. మిగతా తొమ్మిది కోట్లు బకాయిగానే ఉన్నదన్నారు.

అసెంబ్లీలో గళం విప్పుతా..

చెరకు రైతు సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పుతా. మా పార్టీ అధికారంలో లేకపోయినప్పటికీ.. అధికారంలో ఉన్నవారు రైతులకు మద్దతుగా చర్యలు చేపట్టాలి. రైతులకు మద్దతుగా అన్ని విధాలుగా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నా.

- ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఎన్నికల ముందు మాయమాటలు

పరిశ్రమలో క్రషింగ్ ప్రారంభించి.. రైతులకు బకాయి ఉన్న రూ.9కోట్లను చెల్లించాలని పరిశ్రమ గేటు ఎదుట మేము ఆందోళన చేపట్టాము. ఈ ఆందోళనను విరమింపచేసేందుకు జిల్లా స్థాయి, డివిజనల్ స్థాయి అధికారులు విశ్వప్రయత్నాలు చేశారు. ఎన్నికలు జరిగి ఇన్ని రోజుల వతున్నా.. నేటికీ చెరకు రైతుల గురించి మాట్లాడకపోవడం బాధాకరం. ఎన్నికల ముందు మాయమాటలు చెప్పి.. ఆందోళన విరమింపజేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చెరకు రైతులకు న్యాయం చేయాలి.

- కొండల్ రెడ్డి, రైతు నాయకులు



చెట్లు నరకొద్దని.. చెట్టెక్కిన బాలుడు

సుమారు ఏడు, ఎనిమిది గంటలు చెట్టుపైనే..

నరకబోమని ఆర్డర్ తీసుకువస్తేనే చెట్టు దిగుతానని స్పష్టం..

నవతెలంగాణ-రామచంద్రాపురం



జీవరాసులన్నింటికీ జీవనాధారం అయిన చెట్లను నరకొద్దంటూ.. ఓ బాలుడు చెట్టు ఎక్కాడు. గంటల తరబడి చెట్టుపైనే ఉండి నిరసన వ్యక్తం చేశాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలోని కాకతీయ నగర్‌లో జరిగింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. కాకతీయనగర్‌లో రోడ్డు వెడల్పులో భాగంగా కొన్ని చెట్లను తొలగిస్తున్నారు. అయితే ఎలాంటి ఆర్డర్లు లేకుండా చెట్లను తొలగిస్తున్నారని అనిరుద్ అనే 12 ఏండ్ల బాలుడు మంగళవారం ఉదయం స్థానికంగా ఉన్న ఓ చెట్టుపైకి ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ బాలుడు మాట్లా డుతూ.. రోడ్డు వెడల్పు కోసం ఎలాంటి ఆర్డర్లు లేవని అయినప్పటికీ.. కొందరు కావాలనే చెట్లను నరుకుతున్నారని ఆరోపించాడు. చెట్ల అనేక రకాలుగా మానవాళికి, జీవరాసులకు ఉపయోగపడుతాయని చెప్పాడు. అలాంటి చెట్లను నరకి వేయొద్దని విజ్ఞప్తి చేశాడు. చెట్లు నరకబోమని ఆర్డర్ తెస్తేనే చెట్టు దిగుతానని స్పష్టం చేశాడు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆ చెట్టుపైనే ఉండి నిరసన తెలిపాడు.

అంతర్ జిల్లా దొంగలు అరెస్ట్

- ఒంటరి వృద్ధులే టార్గెట్‌గా దొంగతనాలు
- వాహన తనఖీల్లో పట్టుబడిన ఇద్దరు నిందితులు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

ఒంటరిగా ఉన్న వృద్ధ మహిళలను టార్గెట్ చేసి బంగారం ఎత్తుకెళ్తున్న ఇద్దరు అంతర్ జిల్లా దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్టు సిద్దిపేట ఏసీపీ సురేందర్ రెడ్డి తెలిపారు. సిద్దిపేట ఏసీపీ ఆఫీస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఏసీపీ చెప్పిన వివరాల ప్రకారం..

సిద్దిపేటరూరల్ ఎస్ఐ కిరణ్ రెడ్డి తన సిబ్బందితో కలిసి పుల్లూర్ ఎక్స్‌రోడ్ వద్ద మంగళవారం ఉదయం వాహన తనిఖీ చేపట్టారు. ఈ నేపథ్యంలో సిరిసిల్ల పట్టణ'ానికి చెందిన మ్యాన శివ, కూరపాటి నరేష్‌లు హెూండా ఆక్టివా బైక్‌పై అనుమానస్పదంగా వస్తుండగా.. ఎస్సై వాళ్ళను పట్టుకొని విచారించారు. దాంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వారు ఆరు నెలల క్రితం సిద్దిపేట వన్ టౌన్ పరిధిలోని నాసర్‌పురలో ఓ వృద్ధురాలు ఒంటరిగా ఇంట్లో పడుకొని ఉండగా.. మూడు తులాల బంగారు పుస్తెల తాడును బలవంతంగా లాక్కొని వెళ్లారు. అలాగే రెండు నెలల క్రితం ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలో ఓ ఒంటరి వృద్ధురాలు తన ఇంటి ముందు కూర్చొని ఉండగా ఆమెను ఏమార్చి మెడలో నుంచి రెండు తులాల బంగారు పుస్తెల తాడు బలవంతముగా లాక్కొని వెళ్లారు. నవంబర్ నెలలో రాఘవపూర్ గ్రామానికి చెందిన దగ్గుల ఆగవ్వ పొలం వద్ద ఒంటరిగా దూడకు నీళ్ళు పెడతుండగా వెనక నుంచి వచ్చిన వారు.. సిద్దిపేటకు దారి ఎటు అని అడిగా ఆమెను ఏమార్చి మూడు తులాల బంగారు పుస్తెల తాడు బలవంతంగా లాక్కొని వెళ్లారు. పోలీసుల విచారణలో వారు ఈ నేరాలను ఒప్పుకున్నట్టు ఏసీపీ చెప్పారు. అంతేకాకుండా వారు నేరానికి వాడిన యాక్టివా స్కూటీ కూడా గతంలో వేములవాడ టెంపుల్ వద్ద దొంగతనం చేసినట్టు తేలింది. గతంలో కూడా వారిపై పలు దొంగతనం కేసులు వున్నాయని ఏసీపీ చెప్పారు. ఈ విలేకర్ల సమావేశంలో వన్ టౌన్ సీఐ కృష్ణా రెడ్డి, రూరల్ సీఐ చేరాలు, రూరల్ ఎస్ ఐ కిరణ్ రెడ్డి, కానిస్టేబుల్స్ రవి రాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.



దామోదరకు శుభాకాంక్షలు తెలిపిన రజక స్టేట్ యూత్ ప్రెసిడెంట్

నవతెలంగాణ-మునిపల్లి

రజక సంఘం రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రశాంత్ రజక.. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంత్‌తో పాటు మాజీ జెడ్పీటీసీ వీర్ ఇలాల్ రజియుదిన్ అలియాస్(అసత్ పటేల్), సదాశివుడు పోలీస్ పటేల్ ఉన్నారు.

పత్తి కొనుగోళ్లలో మోసం..



నవతెలంగాణ-పుల్కల్

పుల్కల్ మండల కేంద్రంలోని కోదండరామ జిన్నింగ్ మిల్‌లో తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేస్తూ మోసం చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపించారు. క్వింటా పత్తికి సీసీఐ రూ.7,020 కేటాయించగా.. ఈ మిల్లులో మాత్రం రూ.7,015 మాత్రమే చెల్లిస్తున్నా రన్నారు. అంతేకాకుండా చిన్నకారు రైతులు తీసుకువచ్చిన ఐదు, పది క్వింటాళ్ల పత్తిని ప్రయివేటు కాంటాలు పెడుతూ దోపిడీ చేస్తున్నారని మండి పడ్డారు. ఇదేంటని అడిగితే.. 'నీ పత్తి మాకు అసవరం లేదు.. ఇష్టం వచ్చిన చోట అమ్ముకో' అంటూ పరు షంగా మాట్లాడుతున్నారని పలువురు రైతులు వాపోయారు. వారం రోజుల క్రితం కొందరు రైతులు తాము తీసుకొచ్చిన పత్తి పంటను బ్లాక్‌లో విక్రయించేందుకు ముందుకు రాగా.. ఈ పత్తి బాగోలేదు దీనికి కేవలం రూ.6,600 మాత్రమే వస్తుందని చెప్పారని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి.. కొనుగోళ్లను సవ్యంగా జరిగేలా చర్యలు తీసుకుని, రైతులకు న్యాయం చేయాలని కోరారు.



పోసానిపేటలో ఉచిత పశు వైద్య శిబిరం

నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండలంలోని పోసానిపేట గ్రామంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోగిపేట ఏడి డాక్టర్ బాలాజీ హాజరై మాట్లాడుతూ.. పశువు ఏద లక్షణాలను గుర్తించి సకాలంలో ఎద సూది వేయించాలని సూచించారు. లేగ దూడలకు సకాలంలో నట్టల నివారణ మందులు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్వైజర్ సి. అర్జునయ్య వి ఏ జి. కీర్తన సబార్డినేట్ రాజ్ కుమార్ గోపాలమిత్రులు పి నాగరాజు కేఆర్ ప్రభు మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

18 ఏండ్లు నిండితే ఓటరుగా నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-ఝరాసంగం

18 ఏండ్లు పైబడిన వారందరూ ఓటర్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక తహసీల్దార్ సంజీవరావు అన్నారు. ఝరాసంగం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బీఎల్ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితాల్లో ఇప్పటికే నమోదు చేసుకున్న వారి ఫోటోలు గుర్తుపట్టనివిగా ఉంటే.. వాటి స్థానంలో కొత్త ఫోటోలను సేకరించాలని తెలిపారు. ఎన్నికల ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1950 సెక్షన్ 22/రిజిస్టర్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్, 1960 లోని 21 ఎ నియమం ప్రకారం నియోజకవర్గంలో డబుల్ ఓటరుగా ఉండకూ డదన్నారు. కావున ఓటర్ల జాబితా నుండి మరణించిన, డబుల్ గా నమోదైన, ఊరు వదిలి శాశ్వతంగా వెళ్లిపోయిన వారి జాబితాలను తయారుచేయాలని ఆదేశించారు. అంతేకాకుండా గ్రామాలలో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి ఓటర్ లిస్టు చదివి వినిపించి గ్రామస్తుల సహకారంతో తొలగించే విధంగా నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామారావు, బీఎల్వోలు పాల్గొన్నారు.





కేంద్ర పథకాలపై అవగాహన

నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండల పరిధిలోని మాసంపల్లి, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహనా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వికసిత భారత్ సంకల్ప యాత్ర పేరుతో ఎల్ఈడి స్క్రీన్ పైన 17 కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో అందోల్ మండలం వ్యవసాయ అధికారి విజయరత్న, ఉద్యానవన శాఖ అధికారి కీర్తి కృష్ణ, మెడికల్ ఆఫీసర్ సత్యనారాయణ, అంగన్వాడి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆర్డీఓ కార్యాలయ ఏర్పాటు పనుల పరిశీలన



నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్‌చెరు నియోజకవర్గానికి ఇటీవలే మంజూరైన ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు పనులను ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు పట్టణంలోని మండల పరిషత్ ప్రాంగణంలో వివిధ కార్యాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అతి త్వరలో తుది నిర్ణయం తీసుకొని కార్యా లయం నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్టు చెప్పారు. ఇప్పటికే ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించిన భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీఎస్ నిబంధనలపై నేడు అవగాహనా కార్యక్రమం



నవతెలంగాణ-సంగారెడ్డి

ఆదాయపు పన్ను శాఖ టీడీఎస్ విభాగం ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని శాఖల డీడీఓలకు ఆదాయపు పన్ను, టీడీఎస్ నిబంధనలపై నేడు(బుధవారం) అవగాహనా కార్యక్రమం నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నేటి ఉదయం 11:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు సంగారెడ్డి, ఆందోల్ డివిజన్ల డీడీఓలకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు జహీరాబాద్, నారాయణ్ ఖేడ్ డివిజన్‌ల డీడీఓలకు సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో టిడీఎస్ నిబంధనలు, ఆదాయపు పన్ను చట్టంలోని నిబంధనలపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ అవగాహనా కార్యక్రమానికి నిర్దేశిత సమయంలో ఆయా డివిజన్ల పరిధిలో గల అన్ని శాఖల డీడీఓలు హాజరు కావాలన్నారు.



ఇక్రిసాట్ డిప్యూటీ డైరెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-పటాన్‌చెరు

శాసనసభ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించిన పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.. మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఇక్రిసాట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అరవింద్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు. హ్యాట్రిక్ విజయం సాధించడం పట్ల ఎమ్మెల్యేకు అరవింద్‌కుమార్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ ప్రభాకర్, అమీన్పూర్ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రాజు, కృష్ణ, గూడెం సంతోష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు



నవతెలంగాణ-పుల్కల్

మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అందోల్ నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో ఎంతోమందికి దళితబంధు ఇప్పించారని.. అలాంటి నాయకుడిపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని పుల్కల్ ఎంపీటీసీ శ్రీనివాస్ చారి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం విలేకర్ల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ.. చంటి క్రాంతి కిరణ్ పాలనలో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా.. ఆందోల్ నియోజకవర్గంలో దళితబంధు, మైనార్టీ బంధు పథకాలను అర్హులకు అందజేశారన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఎన్నో అభివృద్ధి పనులు చేశారన్నారు. ఎక్కడా కబ్జాలు చేయలేదన్నారు. మంత్రి దామోదర్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా నియోజకవర్గ ప్రజలు అంతా గమనిస్తున్నారని.. ఇప్పటికైనా ఇలాంటి అసత్య ఆరోపణలు మానుకుని ప్రజలకు సేవ చేయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తాటిపల్లిలో రేపటి నుంచి వాలీబాల్ పోటీలు



నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని తాటిపల్లి అంబేద్కర్ కాలనీలో అంబేద్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రేపు, ఎల్లుండి ఓపెన్ టు ఆల్ వాలీబాల్ పోటీలను వెంకట లక్ష్మారెడ్డి అలియాస్ రాజు దొర ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు అంబేద్కర్ సంఘం సభ్యులు నర్సిములుచ రాములు తెలిపారు. ఈ పోటీలకు 28 జట్లు ఎంట్రీ ఫీజుతో రిజిస్ట్రేషన్ చేసుకున్నాయన్నారు. ఆసక్తి ఉన్న వారు ఒక్కో జట్టుకు రూ.600 ప్రవేశ రుసుంతో నేటి వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 7780772250కు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బులు పంపి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మొదటి విజేతలకు రూ.30,000, ద్వితీయ విజేతకు రూ.15,000 బహుమతి ఉంటుందన్నారు. వచ్చిన జట్లకు భోజన, వసతి సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు. వివరాల కోసం 9652469277, 7780772250 ఫోన్ చేసి తెలుసుకోవాలన్నారు.



అయ్యప్ప ఆలయంలో అన్నదానం

నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట హౌసింగ్ బోర్డులోని అయ్యప్ప ఆలయంలో మంగళవారం పీఆర్‌టీయు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎ.మాణయ్య, 17వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ ఎ.చిట్టిబాబుల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సుమారుగా 100 మంది అయ్యప్ప స్వాములు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం అయ్యప్ప స్వాముల ఆశీస్సులను పొందారు.



బిల్లాపూర్‌లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



బెల్లాపూర్, బాధలుగావ్ గ్రామాల్లో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సందర్భంగా.. వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి హెల్త్ క్యాంప్ చేపట్టారు. బీపీ, షుగర్, సికిల్ సెల్ డిసీస్, టీబి తదితర టెస్టులు చేసి.. టాబ్లెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్‌హెచ్‌పి శ్రావణి, ఏఎన్ఎం మీరాబాయి, సెక్రెటరీలు శ్రీనివాస్, రాజు, సర్పంచులు, అంగన్వాడీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆత్మస్థైర్యం స్ఫూర్తిదాయకం





నవతెలంగాణ-సంగారెడ్డి

సమాజంలో దివ్యాంగులు సకలాంగులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారి మనోధైర్యం, ఆత్మస్థైర్యం అందరికీ స్ఫూర్తిదాయకమని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని డా.బి.ఆర్. అంబేడ్కర్ స్టేడియం గ్రౌండ్స్‌లో మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతికూలతలను అధిగమిస్తూ అసమాన విజయాలను సాధించే దివ్యాంగులు ఎంతో మందికి స్ఫూర్తి ప్రదాతలుగా నిలుస్తారన్నారు. దివ్యాంగులలో మనోస్థైర్యం, ఆత్మస్థైర్యం అందరికన్నా ఎక్కువగా ఉంటుందని, ఈ క్రీడా పోటీల్లో తమ పూర్తి శక్తి సామర్థ్యాలు ఉపయోగించి గెలవాలని కోరారు. జిల్లాస్థాయి దివ్యాంగుల ఆటల పోటీల్లో శారీరక వైకల్య సమస్యలను అధిగమించి ఉత్సాహంగా పాల్గొంటున్న వారందరిని అభినందించారు. అనంతరం క్రీడా పోటీలను ప్రారంభించారు. దివ్యాంగులకు నిర్వహించిన చెస్, క్యారమ్, వీల్ చైర్స్ రేస్, రన్నింగ్, షాట్ పుట్ పోటీలను వీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సంధ్యారాణి, జిల్లా యువజన క్రీడల అధికారి రామచందర్ రావు, డీఆర్‌డీఏ అదనపు పీడీ సూర్యారావు, సీడీపీవోలు, దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు, పీఈటీలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వాలంటీర్లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



రుణాలు అందించడంలో బ్యాంకర్లు సహకరించాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లాలో వివిధ ఆర్థిక మద్దతు పథకాల లక్ష్య సాధనకు రుణాలు అందించడంలో బ్యాంకర్లు పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి నగేష్ బ్యాంకర్లను కోరారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో రైతులకు రుణాల పంపిణీ, స్వయం సహాయక సంఘాల రుణాలు, రికవరీ, పీఎం జి.పి.వై. రుణాలు, ఎస్సీ, బిసి, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖల పథకాలకు సంబంధించి ఋణ లక్ష్య పురోగతి పై డీసీసీ, డీఎల్‌ఆర్‌సీ సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ ఆర్థిక మద్దతు పథకాలకు సంబంధించి వంద శాతం లక్ష్యసాధనకు బ్యాంకర్లు, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రాధాన్యత, ప్రాధాన్యేతర రంగాలకు సంబంధించి జిల్లాలో రూ.7800 కోట్ల రుణాలు అందించడం లక్ష్యం కాగా, ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకు వివిధ బ్యాంకుల ద్వారా రూ.7911.21 కోట్ల రుణాలు అందించినట్టు ఎల్‌డీఎం గోపాల్ రెడ్డి తెలిపారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా షెడ్యూల్ మేరకు జిల్లాలోని ఆయా గ్రామ పంచాయతీలో అన్ని బ్యాంకులు పాల్గొని.. బ్యాంకుల ద్వారా అమలవుతున్న ఆయా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాని, అర్హులైన వ్యక్తులను పథకాల్లో నమోదు చేయలని ఎల్‌డీఎం బ్యాంకర్లకు సూచించారు. అనంతరం నాబార్డ్‌కు సంబంధించిన 2024-25 జిల్లా పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎల్డియం గోపాల్ రెడ్డి, ఆర్‌బీఐ ఎజియం తాన్యా, నాబార్డ్ డీడీఎం కృష్ణ తేజ, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, మెప్మా పీడీ గీత, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ప్రశాంత్ ,వ్యవసాయ శాఖ జేడి నరసింహా రావు, ఉద్యాన శాఖ డీడీ వెంకటేశ్వర్లు, సంక్షేమ శాఖల అధికారులు, అన్ని బ్యాంకుల కంట్రోలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికా బద్ధంగా గ్రామాలభివృద్ధి

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ఇంద్రేశంలో సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-పటాన్‌చెరు

ప్రణాళికా బద్ధంగా గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకొని వెళ్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు మండలంలోని ఇంద్రేశం గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణ పనులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్ చెరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించడంతోపాటు అభివృద్ధిలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేస్తున్నామన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకల్లో..

ఇంద్రేశం గ్రామ పరిధిలోని పీఎస్ఆర్ కాలనీలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ విజయ్ కుమార్, సర్పంచ్ నర్సింలు, డీసీసీబీ డైరెక్టర్ రాఘవేంద్ర రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శివారెడ్డి, నాయకులు బండి శంకర్, మాణిక్ రెడ్డి, దుర్గా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైద్య ఖర్చులకు పదివేల ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన మొహమ్మద్ ముబారక్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ మల్లారెడ్డి ఆసుపత్రిలో ఆపరేషన్ నిమిత్తం అడ్మిట్ అయ్యారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, బొల్లారం మున్సిపల్ వైస్ చైర్మెన్ అంతిరెడ్డిగారి అనిల్ కుమార్‌రెడ్డి.. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి.. భయపడొద్దని తాను అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. అంతేకాకుండా తన వంతు సాయంగా రూ.10,000ను అందజేశారు. ఈ కార్యక్రమంలో బొల్లారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు కాటారం శ్రీనివాస్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు పుల్లగూర్ల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- అందోల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రాంబాబు ముదిరాజ్
- అందోల్ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక


రాంబాబు

నవతెలంగాణ-జోగిపేట

జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసేందుకు ప్రెస్‌క్లబ్ కార్యవర్గం పనిచేస్తుందని.. అందోలు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఆకుల రాంబాబు ముదిరాజ్ అన్నారు. అందోల్ మండలం మాసానిపల్లి శివారులోని ఫాంహౌస్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల విషయాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖా మంత్రి దామోదర్ రాజ నర్సింహా దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. భవిష్యత్తులో ప్రెస్‌క్లబ్‌ను బలోపేతం చేయడంతో పాటు అందోల్ నియోజకవర్గంలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఏ రాజకీయ పార్టీకో, యూనియన్‌లకు కొమ్ముకాయదని, న్యాయం దిశగా తమ పయనం ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో క్లబ్ ఆధ్వ ర్యంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టి అందోల్ ప్రెస్‌క్లబ్‌ను మరింత అభివృద్ధి చేసుకుందా మన్నారు.

అందోలు ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం....

అందోల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులుగా ఆకుల రాంబాబు ముదిరాజ్, గౌరవ అధ్యక్షులుగా పి.సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్(రాజు), చాపల సత్యం, ప్రధాన కార్యదర్శిగా సంజీవ్‌కుమార్, సహాయ కార్యదర్శిగా ఉమాశంకర్, మెట్టు రమేష్, ప్రచార కార్యదర్శిగా ఎ.నర్సింలు, సంయుక్త కార్యదర్శిగా సందీప కుమార్, కోశాధికారిగా జి.సంతోష్‌కుమార్, కార్యదర్శులుగా మహమ్మద్ ఫయాక్, వి.అశోక్, గౌరవ సభ్యులుగా మధు, శ్రీశైలం, గోవర్ధన్, నదరి రమేష్, షాహీద్, రాజు, శరణ్, ఎం.నాగేష్, శ్రీకాంత్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



గీతం పూర్వ విద్యార్థినికి 14వ గిన్నిస్ రికార్డు

నవతెలంగాణ-పటాన్‌చెరు





హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన బీటెక్(2016-20) పూర్వ విద్యార్థిని శివాలి జోహ్రి శ్రీవాస్తవ 14వ గిన్నిస్ రికార్డు సాధించి చరిత్ర సృష్టించారు. చేతితో తయారు చేసిన 2,700 కాగితం బొమ్మలను ఒకేచోట ఉంచి.. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రదర్శనగా రికార్డు నెలకొల్పారు. చిన్నపాటి రంగు కాగితాన్ని కూడా కళాత్మకంగా మలచగల నేర్పు శివాలీ కుటుంబానికి వరంగా మారింది. ఏకంగా విశ్వ యవనికపై విజ యకేతనం ఎగురవేయడానికి తోడ్పడింది. అదీ ఏదో ఒకటీ.. రెండూ.. కాదు, ఏకంగా 14 గిన్నిస్ రికార్డులు, 15 అసిస్ట్ వరల్డ్ రికార్డులతో పాటు నాలుగు యూనిక్ వరల్డ్ రికార్డులు. హైదరాబాద్‌లోని ఒకే కుటుంబం ఇన్ని గిన్నిస్ కలిగి ఉండడం కూడా మరో రికార్డుగా వినుతికెక్కడం విశేషం. ఇంతకు మునుపు, శివాలి కుటుంబం హ్యాండ్ మేడ్ పేపర్తో రూపొం దించిన 1,251 విభిన్న బొమ్మలను కొలువుతీర్చి తొలి గిన్నిస్ రికార్డు నెలకొల్పింది. ఆ తరువాత 7,011 లో విభిన్న కాగితం పువ్వులను ప్రదర్శించి మలి రికార్డు, 2,111 విభిన్న బొమ్మలు, 3,501 ఆరెగామి వేల్స్, 2,100 ఆరెగామి పెంగ్విన్స్, 6,132 ఆరెగామి సిట్రస్ (నిమ్మ తొనలు)లు, 6,100 ఆరెగామి వేల్స్, 2,500 ఆరెగామి పెంగ్విన్స్, 1,451 ఆరెగామి మాఫ్లీలు, 2,200 క్విల్లింగ్ డాల్స్, 9,200 ఆరెగామి ఫిష్, 1,993 ఆరెగామి మాఫ్లీలీవ్లను ప్రదర్శనకు ఉంచి ఇప్పటివరకు 13 గిన్నిస్ రికార్డులను సొంతం చేసుకున్న విషయం విధితమే. మొత్తం 14 గిన్నిస్ రికార్డులను సాధించిన శివాలి, ఆమె తల్లిదండ్రులను గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, బీటెక్ తొలి ఏడాది సమన్వయకర్త ప్రొఫెసర్ పి.త్రినాథరావు, గణిత విభాగం అధ్యాపకుడు డాక్టర్ మల్లికార్జున్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించారు.

ఎంఎస్ఎస్ఓ మండల ఇన్‌చార్జి విందులో మైనంపల్లి



నవతెలంగాణ-నిజాంపేట

మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ మండల ఇన్చార్జి వెల్దుర్తి వెంకటేష్ గౌడ్ నివాసంలో మంగళవారం జరిగిన విందుకు మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు హాజరయ్యారు. ఈ మేరకు ఆయనను కాంగ్రెస్ కార్యకర్తలు శాలువా కప్పి సన్మానించారు. పలువురి సమస్యలను అడిగి తెలుసుకుని త్వరలోనే పరిష్కారిస్తానని మైనంపల్లి హన్మంతరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, మండల అధ్యక్షుడు మారుతి, రామాయంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ రెడ్డి, సుప్రభాతా రావు, దీపు రావు, నసీరుద్దీన్, చెప్యాల ముత్తిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, రవీందర్ రెడ్డి, రాంపూర్ లక్ష్మణ్, మసూద్, వినోద్, ఆకుల బాలయ్య చలిమేటి నరేందర్, జాల శ్రీకాంత్, రాజు, కాకి రాజయ్య, పంజా బాబు, శ్రీకాంత్ గౌడ్, మహేష్ గౌడ్, భూమా గౌడ్, మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

డీసెట్ ప్రవేశాలకు నేటి నుంచి ధృవపత్రాల పరిశీలన

డైట్ ప్రిన్సిపాల్ రమేష్ బాబు

నవ తెలంగాణ-హవేలీఘనపూర్

అనివార్య కారణాల వలన గతంలో జరిగిన డీసెట్ ధృవపత్రాల పరిశీలనకు రాని వారు హవేలీ ఘనాపూర్ ప్రభుత్వ డైట్ కళాశాలలో బుధవారం నుంచి నిర్వహిస్తున్న ధృవ పత్రాల పరిశీలనకు హాజరు కావాలని డైట్ ప్రిన్సిపాల్ రమేష్ బాబు తెలిపారు. డైట్ సెట్ అర్హత పొందిన అభ్యర్థులు తమ ర్యాంకు కార్డు, డైట్‌సెట్ హాల్ టికెట్, పదవ తరగతి మార్కుల మెమో, ఇంటర్ మీడియట్ మార్కుల మెమో, బదిలీ (ట్రాన్స్ ఫర్) సరిఫికేటు, 4వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు బోనాఫైడ్ సర్టిఫికేట్లు, ఇంటిగ్రేటెడ్ కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, స్పెషల్ క్యాటగిరీ సర్టిఫికేటు, యన్ సిసి. గేమ్స్ స్పోర్ట్స్, దివ్యాంగులు, సైన్యంలో పని చేసిన సర్టిఫికెట్లు తీసుకొని రావాలన్నారు. ఈ నెల 22వ తేదీ నుంచి 27వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ పెట్టుకోవాలని, 30వ తేదీన సీట్లు కేటాయించబడతాయన్నారు. సీటు పొందిన వారు జనవరి 1వ తేది నుంచి 3వ తేది వరకు అలాట్మెంట్ లెటర్‌ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. జనవరి 5వ తేది వరకు కేటాయించిన కళాశాలలో ప్రవేశం పొందాల్సి ఉంటుందన్నారు. జనవరి 8 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ యూత్ ఉపాధ్యక్షులు షేక్‌అలీ



నవ తెలంగాణ-నర్సాపూర్

శివంపేట మండల బీఆర్ఎస్ పార్టీ యూత్ ఉపాధ్యక్షులు షేక్ అలీ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు నవీన్ గుప్త ఆధ్వర్యంలో మంగళవారం నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి సమక్షంలో షేక్ అలీ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కరుణాకర్ రెడ్డి, నవీన్ గుప్తా, నాయకులు గణేష్, మల్లికార్జున్, చంద్ పాషా తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం మారినా... సీఎంల ఫోటోలు మారలేదు



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటికీ ప్రభుత్వ కార్యాలయంలో ముఖ్యమంత్రి ఫోటోలు మాత్రం మారలేదు. ప్రభుత్వం మారిన వెంటనే ఆయా ప్రభుత్వ కార్యాలయాలలో పాత సీఎం ఫోటోలు తీసివేసి కొత్త సీఎం ఫోటోలు పెట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికి పలు కార్యాలయాలలో మాజీ సీఎం చంద్రశేఖర్ రావు ఫోటోలు దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ మారి 10 రోజులు అయినప్పటికీ ముఖ్యమంత్రి ఫోటోలు మార్చకపోవడంపై పలువురు కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇంత నిర్లక్ష్యం వహించడంపై అంతర్యమేంటని చర్చించుకుంటున్నారు. మన గవర్నమెంట్ వచ్చింది కదా ఏమి కాదులే అనే ధైర్యం ఉద్యోగులలో వచ్చిందా అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. లేదంటే కాంగ్రెస్ గవర్నమెంటే కదా ఏమి కాదులే అనే భావన అధికారులలో నెలకొందా అని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం మారిన వెంటనే కొత్త సీఎం ఫోటోలను పెట్టుకోవాల్సిన అధికారులు హుస్నాబాద్‌లో ఏ ప్రభుత్వ కార్యాలయంలో ముఖ్యమంత్రి ఫోటో లేకపోవడం గమనార్హం. ఆయా కార్యాలయలలో పాత సీఎం ఫోటో అలానే ఉంచడం ఆయన మీద అభిమానమా లేకుంటే నిర్లక్ష్యమా అనేది చర్చనీయాంశమైంది. ఇప్పటికైనా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల, విద్యాసంస్థలలో పాత సీఎం ఫోటోలు మార్చి నూతన సీఎం ఫోటోలను పెట్టాలని పలువురు కోరుతున్నారు.

మాజీ ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించం



నవతెలంగాణ-టేక్మాల్

అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించమని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు భక్తుల వీరప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత బంధు కోసం రూ.12 లక్షలను ఇచ్చానని భూమయ్య అనే వ్యక్తి అబద్ధపు మాటలు చెప్పి ఎమ్మెల్యే ప్రతిష్టపై బురద జల్లే ప్రయత్నం చేయడం సరైంది కాదన్నారు. గత సంవత్సరం నుంచి కాంగ్రెస్‌తో లోపాయికార ఒప్పందాన్ని ఏర్పరచుకొని బీఆర్ఎస్ పార్టీని బలహీనపరిచే విధంగా మాట్లాడడం పార్టీ దృష్టికి వచ్చిందన్నారు. తప్పు సరిదిద్దుకోవాలని పలుమార్లు మండల పార్టీ నాయకులు హెచ్చరించినప్పటికీని ఆయన వ్యవహార శైలిలో మార్పు రాలేదన్నారు. పార్టీ కార్యక్రమాలకు దూరం పెట్టడం జరిగిందని చెప్పారు. తాజా ఎమ్మెల్యేతో కలిసి ఫోటోలు దిగడం తమ దృష్టికి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ పార్టీతో సంబంధం లేకుండా ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు మద్దతుగా పనిచేశారని గుర్తించామన్నారు. మాజీ ఎమ్మెల్యేపై బురద జల్లి తాను లబ్ధి పొందాలన్న దురాశతో ఉన్న భూమయ్యపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. భూమయ్య వెనుక ఉండి నడిపించే వారి బాగోతం కూడా బయట పెడతామన్నారు. ఇప్పటికైనా భూమయ్య తన తీరు మార్చుకోవాలని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి అవినాష్ కుమార్ పాల్వంచ సర్పంచ్ శివకుమార్ మాజీ ఎంపీటీసీ సిద్ధన్న మాజీ కోఆప్షన్ సభ్యులు, ఏమి సలీం, పులి మల్లేశం, కంది భాస్కర్, కంది పద్మారావు, చింత రవి, శేఖర్ రెడ్డి లు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-జగదేవ్ పూర్

మండలం పరిధిలోని జంగంరెడ్డిపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సట్టు రాములు కుటుంబ సభ్యులను మంగళవారం మండలంలోని రజక సంఘం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల రజక సంఘం గౌరవాధ్యక్షులు అక్కారం నర్సింలు, ఉపాధ్యక్షులు వడ్లకొండ శ్రీనివాస్, రాచకొండ యాదగిరి, కోశాధికారి రాచకొండ బాల్ నర్సయ్య, సంయుక్త కార్యదర్శి రాచమల్ల, పాండు, జూపల్లి మహేశ్, గ్రామ రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

19 మంది జూదరుల అరెస్టు

సుమారు రూ.1.47 లక్షలు స్వాధీనం : ఎస్ఐ శివకుమార్

నవతెలంగాణ-నర్సాపూర్

19 మంది జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1,47,190ల నగదును స్వాధీనపరచుకున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నర్సాపూర్ మండల పరిధిలోని నత్నయపల్లి గ్రామ శివారులో ఉన్న దుండగుల గోపాల్ రేకుల షెడ్‌లో కొంత మంది జూదం ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం రావడంతో సోమవారం రాత్రి 12.30 గంటల సమయంలో తమ సిబ్బందితో వెళ్లి దాడి చేయడం జరిగిందన్నారు. ఈ దాడిలో జూదం ఆడుతున్న 19 మందిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.1,47,190లను స్వాధీన పర్చుకున్నామని ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన



నవతెలంగాణ-టేక్మాల్

ఆయిల్ పామ్ సాగు విధానంపై మండలంలోని ఎల్లుపేట రైతు వేదికలో శంకరంపేట ఏడిఏ రాంప్రసాద్ రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో రాంప్రసాద్ మాట్లాడుతూ ఆయిల్ ఫావమ్ సాగు గురించి వివరించారు. నీరు నిలువ, నేలలు అనుకూలం, ఒక ఎకరం వరి సాగుకు అవసరమయ్యే నీటితో 3-4 ఎకరాల ఆయిల్ ఫామ్ సాగు చేయవచ్చని తెలిపారు. సమాంతర త్రిభుజకార పద్ధతిలో ఎకరానికి 57 మొక్కలు అవసరమవుతాయన్నారు. సీజన్‌ను బట్టి పాదులలో తేమ ఉండేలా చూసుకోవాలన్నారు. పాదులలో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. నత్రజని, భాస్వరం, పోటాష్ ఎరువులు దపాలుగా 1 సంవత్సరం, 2వ సంవత్సరం 3వ సంవత్సరం వేసుకోవాలన్నారు. అంతర పంటలుగా మొక్కజొన్న, పత్తి, అరటి, పొద్దు తిరుగుడు, మిరప, సోయా బిన్, పసుపు, పూలు, పెసర, మినుము, అలసంద, నువ్వులు, వేరుశనగ, కూరగాయలు వేసుకోవచ్చన్నారు. ఆయిల్ ఫామ్ చెట్టు నాటిన 14-18 నెలలు తరువాత పూతకు వస్తుందన్నారు. గెలల దిగుబడి 3-4 సంవత్సరాలు మధ్య ప్రారంభమై 7వ సంవత్సరం నుంచి నిలకడగా అధిక దిగుబడి స్థాయికి చేరుతుందన్నారు. హెక్టారుకు 25-30 టన్నులు దిగుబడి వస్తుందన్నారు. ఆయిల్‌ఫామ్ సాగు వల్ల నాటిన 4 సంవత్సరాలు నుంచి 30 సంవత్సరాలు వరకు నిరంతర ఆదాయం వస్తుందన్నారు. అదే విధంగా పంట సాగుకు ప్రభుత్వ రాయితీలు ఇస్తుందని, చీడ పీడల బెడద తక్కువగా ఉంటుందన్నారు. అంతర పంటల ద్వారా ఆదాయం లభిస్తుందన్నారు. లీవింగ్ ఫుడ్స్ ప్రయివేట్ కంపెనీ నుంచి మొక్కలు నాటిన దగ్గరి నుంచి నిరంతరం క్షేత్ర పరిశీలన, సాంకేతిక సలహాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫామ్ మేనేజర్ డా.కృష్ణ, శంకరంపేట్ (అ) అధికారులు రాంప్రసాద్, మీనా, ఫీల్డ్ ఆఫీసర్ మనోహర్, రైతులు పాల్గొన్నారు.

పూరి గుడిసె దగ్ధం



ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని విజ్ఞప్తి



నవతెలంగాణ-నార్సింగి

మండల పరిధిలోని శేరిపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు పూరి గుడిసె దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం పది గంటల ప్రాంతంలో చెప్యాల నరసింహులు, లక్ష్మి దంపతులు కొడుకు భరత్, కూతురు భానుశ్రీతో కలిసి నివసిస్తున్న పూరి గుడిసెలో వంట చేసుకుంటున్న సందర్భంగా గుడిసెకు మంటలు అంటుకున్నాయి. మంటలు వ్యాప్తి చెందడాన్ని గమనించి వారు చుట్టు పక్కల వారి సహకారంతో మంటలను ఆర్పివేశారు. అప్పటికే వారి ఇంట్లోని నిత్యావసర సరకులతో పాటు కొంత నగదు, బట్టలు, బెడ్ షీట్లు కాలి పోయి నష్టం వాటిల్లింది. నరసింహులు కుటుంబం పేద కుటుంబమని, అతనికి ప్రభుత్వం తరపున రావాల్సిన సహాయ పథకాలు, పక్కా గృహం ఏర్పాటు చేయాలని సర్పంచ్ కోరారు. తహసీల్దార్ షేక్ కరీంను ఫోన్లో సంప్రదించి విషయాన్ని వివరించి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరగా, తహసీల్దార్ సానుకూలంగా స్పందించారని సర్పంచ్ తెలిపారు. నరసింహులు కుటుంబం నిరుపేద కుటుంబమని, కూలినాలి చేసుకుని జీవనం గడుపుతుందని, ప్రభుత్వం, స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతలు కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు తాళ్ళ కృష్ణా గౌడ్, శివొల్ల చంద్రం, చెప్యాల వెంకటి, చెప్యాల రమేష్, కట్ట మల్లేశంలు విజ్ఞప్తి చేశారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మైనంపల్లి



నవతెలంగాణ-నిజాంపేట

మండలపరిధిలోని నందిగామ గ్రామానికి చెందిన పాపయ్యగారి బాబు (30) ఇటీవల కువైట్‌లో బాత్ రూమ్‌లో జారిపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు మంగళవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని భార్య ముగ్గురు చిన్నపిల్లలను చూసి చలించి పోయిన మైనంపల్లి హన్మంతరావు మృతుడి కుటుంబానికి రూ.1.25 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేస్తానన్నారు. అదేవిధంగా ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా కుటుంబాన్ని ఆదుకుని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మృతుని భార్యకు ఉపాధి కల్పించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, రామాయంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ రెడ్డి, పీసీసీ సభ్యులు సుప్రభాతా రావు, పల్లె రామచంద్ర గౌడ్, నిజాంపేట మండల అధ్యక్షుడు మారుతి, నసీరుద్దీన్, ఆకుల బాలయ్య సత్యనారాయణ రెడ్డి, మోహన్ రెడ్డి, దీపు రావు, రవీందర్ రెడ్డి, రాంపూర్ లక్ష్మణ్, శ్రీకాంత్ గౌడ్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



నవతెలంగాణ-మద్దూరు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని రేబర్తి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ హరి ప్రసాద్ ఆధ్వర్యంలో ఎల్ఈడి టీవీతో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. పేద ప్రజల కోసం రేషన్ కార్డు లేని ప్రజలకు ఉజ్వల్ యోజన పథకం కింద ఉచితంగా గ్యాస్ సిలిండర్ అందిస్తున్నట్లు వారు తెలిపారు. ఇలాంటి పథకాలు ఎన్నో కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని వారు తెలిపారు. అదేవిధంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి బీపీ, షుగర్ వ్యాధి లక్షణాలు ఉన్న వారికి ఉచితంగా మాత్రలు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కల్పన, పల్లె దావకాన డాక్టర్ ప్రతిభ, ఏఎన్ఎం మలవొత్రి, ఆశా కార్యకర్తలు యశోద, కవిత, కనకలక్ష్మి, హెల్త్ టిబి సూపర్వైజర్ అబ్దుల్ వలీ, హెల్త్ సూపర్వైజర్ రోషన్ అలీ పాల్గొన్నారు.

మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం వాయిదా

మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్



నవ తెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ తెలిపారు. మంగళవారం నర్సాపూర్ మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్ అధ్యక్షతన ఏర్పాటు చేయగా ఈ సమావేశానికి మెజారిటీ కౌన్సిలర్లు హాజరు కాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు. తిరిగి సమావేశాన్ని త్వరలో నిర్వహిస్తామని కమిషనర్ వెంకట గోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు లతా రమేష్ యాదవ్, ఎరుకల యాదగిరి, సంఘసాని సురేష్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

లోక్ అదాలత్ కోర్టును సద్వినియోగం చేసుకోవాలి

ఎస్సై మధుసూదన్ గౌడ్



నవతెలంగాణ-వెల్దుర్తి

క్షణికావేశంతో కొట్టుకుని, తిట్టుకుని, కేసులు పెట్టుకున్న పెండింగ్‌లో ఉన్న కేసులను తక్షణమే పరిష్కారం కోసం లోక్ అదాలత్ కోర్టును ఆశ్రయించి సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై మధుసూదన్ గౌడ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ ప్రజలు, పెద్దలు, సర్పంచులు తమ తమ సమస్యల పరిష్కారం కోసం మెదక్ కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. క్షణికావేశంతో కొట్టుకున్న, తిట్టుకున్న, పొలాల వద్ద పంచాయతీ ఉన్న, భార్యాభర్తల మధ్య గొడవలు ఉన్న, యాక్సిడెంట్ కేసులు, రాజీ పడి కోర్టుకు లేదా పోలీస్ స్టేషన్ వచ్చి రాజీ అయ్యే అవకాశం ఉందన్నారు. రాజీ కావలసిన వారు వెల్దుర్తి పోలీసులను సంప్రదించాలన్నారు. ఎవరైనా రాజీ కాకుండా నేరం ఒప్పుకొని ఫైన్ కట్టడం వలన కూడా కేసు నుంచి విముక్తిని పొందవచ్చని తెలిపారు. తగాదాలు ఉన్నవారు విషయాన్ని తెలుసుకొని కోర్టు వారికి సహకరించాలని కోరారు.

పీహెచ్‌సీలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



నవతెలంగాణ-తొగుట

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో వైద్య అధికారి డాక్టర్ రాదా కిషన్, సుభాషిణి, హెల్త్ సూపర్ వైజర్, సిబ్బందితో కలిసి ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్యామల, హెల్త్ అసిస్టెంట్ రాములు, ఏఎన్ఎంలు సంతోష, సుజాత, అనురాధ, స్వప్న, లక్ష్మీ, నీల తదితరులు ఉన్నారు.



తాగునీటి ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-తొగుట

సోలార్ ప్యాక్, బాల వికాస్ సహకారంతో ఏర్పాటు చేసిన తాగునీటి ప్లాంట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బాల వికాస ప్రతినిధులు రామ చంద్రారెడ్డి, సోలార్ ప్యాక్ ఇండియా అధికారి ప్రతాపరెడ్డిలు సూచించారు. మంగళవారం మండలంలోని ఎల్లారెడ్డి పేట గ్రామంలో బాల వికాస నీటి శుద్ధీకరణ పథకం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోలార్ ప్యాక్, బాల వికాస వారి ఆర్థిక సహకారంతో ఈ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. ఇలాంటి మంచి అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాధారణంగా రూ.5కు 20 లీటర్ల శుద్ధి చేసిన తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, ఎంపీటీసీ వేల్పుల స్వామి, ఉప సర్పంచ్ ప్రవీన్ రెడ్డి, వార్డు సభ్యులు, బాల వికాస ప్రోగ్రాం కోఆర్డినేటర్లు ఏ.శ్రీనివాస్ రావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సిద్దిపేట
4
బుధవారం | 20 డిసెంబర్ 2023 | www.navatelangana.com

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

సర్పంచ్ బత్తుల మల్లయ్య



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాల పల్లి సర్పంచ్ బత్తుల మల్లయ్య అన్నారు. మంగళవారం మండలం లోని మాలపల్లి గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లయ్య మాట్లాడుతూ వికాసి కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అధికారులు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలోఎంపీడీవో రాఘవేంద్రరెడ్డి, ఏవో నాగరాజు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సైకిలింగ్ ఎంపిక పోటీలు



నవతెలంగాణ-సిద్దిపేట

జిల్లాస్థాయి రోడ్ రేస్ సైకిలింగ్ ఎంపిక పోటీలు ఈనెల 20న అంతకపేటలో నిర్వహించనున్నట్లు పోటీల నిర్వాహకులు, జిల్లా సైకిలింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బండారు పల్లి శ్రీనివాసులు, జంగపల్లి వెంకట నరసయ్యలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ పోటీలను అక్కన్నపేట మండలం అంతకపేట మర్రికుంట కట్ట దగ్గర నిర్వహించినున్నట్లు తెలిపారు. పోటీలు అండర్ 14, 16,18, యూత్, మెన్ అండ్ ఉమెన్ విభాగాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన వారిని అనంతరం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రంగనాయక సాగర్ వద్ద ఈనెల 22, 23, 24న జరిగే ఎనిమిదవ రాష్ట్రస్థాయి సైకిల్ పోటీలకు పంపనున్నట్లు వారు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జనన ధ్రువీకరణ పత్రాలతో పాటు సొంత సైకిళ్లు, హెల్మెట్లతో ఉదయం 9 గంటలకు హాజరు కావాల్సిందిగా కోరారు. మరిన్ని వివరాలకు జిల్లా కార్యదర్శి జంగాపల్లి వెంకట నరసయ్య 9441925763, నిర్వహణ కార్యదర్శి చింతకింది శ్రీనివాస్ 9491481828 ను సంప్రదించాల్సిందిగా కోరారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని ధర్మారం, మర్మముల గ్రామాలలో ఉపాధి హామీ పనులు చేసేందుకు స్థలాలను మంగళవారం ఎంపీడీవో శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేసేందుకు స్థలాలను గుర్తించినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా ఫిష్ పాండు, ల్యాండ్ లెవెల్ వర్క్ కొత్తవి గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఈసీ పరశు రాం, టిఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా మహిళా కార్యదర్శిగా కవిత



నవతెలంగాణ-చేర్యాల

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ అధ్యాపకురాలుగా విధులు నిర్వహిస్తున్న ఏలూరి కవిత ను తెలంగాణ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం సిద్దిపేట జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు బరిగెల నారాయణ, ప్రధాన కార్యదర్శి గొంటి రవి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం, సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి కోసం, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తమపట్ల విశ్వాసం ఉంచి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర, జిల్లా కమిటీలకు కృతజ్ఞతలు తెలిపారు.

31వ సారి రక్త దానం చేసిన యువకుడు



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ మూడో వార్డుకు చెందిన గొడు గు రాజు సమాజ సేవ లో భాగంగా 31 సార్లు రక్తదానం చేశారు. గజ్వే ల్ పట్టణంలోని గవర్నమెంట్ హాస్పిటల్‌లో ఎమర్జెన్సీగా ఒక మహిళా డెలివరీ ఆపరేషన్ కోసం బ్లడ్ అవసరం పడింది. బ్లడ్ డోనర్ గొడుగు రాజు గజ్వేల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ బ్లడ్ బ్యాంకులో బ్లడ్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గొడుగు రాజు మాట్లాడుతూ ప్రతి మనిషి తన జీవితంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి బ్లడ్ ఇవ్వడం వల్ల గుండె సంబంధించిన వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. క్యాన్సర్ వ్యాధికి దూరంగా ఉండవచ్చన్నారు. రక్త దానం చేయడం వల్ల ఎలాంటి అపాయం జరగదన్నారు. దీనిపైన ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, ప్రతి మనిషి తప్పకుండా రక్తదానం చేయాలన్నారు.

ముక్కోటి ఏకాదశి కరపత్రాలు ఆవిష్కరణ



నవతెలంగాణ-గజ్వేల్

భద్రాచల దేవస్థానం ఈనెల 23న ఘనంగా నిర్వహించే వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి)కి సంబంధించిన కరపత్రాలు, గోడ పత్రికలు, శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో మంగళవారం కృష్ణాలయంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ గత 25సంవత్సరాల నుంచి లక్షల మంది భక్తులచే రామకోటి లిఖింపజేస్తున్న ఆధ్యాత్మిక సేవను గుర్తించి నేడు భద్రాచల దేవస్థానం ముక్కోటి ఏకాదశి కరపత్రాలను, గోడ పత్రికలను ప్రతి సంవత్సరం పంపించడ రామకోటి రామరాజు భక్తికి నిదర్శనమన్నారు. ముక్కోటి ఏకాదశి రోజున మహా విష్ణువు గరుడ వాహనారుడవై మూడుకోట్ల దేవతలతో భూలోకానికి దిగివచ్చి భక్తులకు దర్శనం ఇస్తారు. మూడు కోట్ల ఏకాదశులతో సమానమే ఈ ముక్కోటి ఏకాదశి అని అన్నారు. సామాజిక సమరసత ఉమ్మడి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆకుల నరేష్‌బాబు మాట్లాడుతూ ఉత్తర ద్వారా దర్శనం వల్ల కోటిపుణ్యాల ఫలితం కలుగుతుందన్నారు. రామ కోటి రామరాజు మరో భక్త రామదాసుగా భద్రాచల దేవస్థానం గుర్తించడం సంతోషం అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాలయం అధ్యక్షులు ఎలగందుల రామచంద్ర, ఉప్పల వెంకటేశం, దూబకుంట మైత్రాములు, అత్తెల్లి లక్ష్మయ్య, అంతునూరి శివకుమార్, తుమ్మ మల్లేశం, దొంతుల దశరథం, మహంకాళి శ్రీనివాస్, బండి నర్సయ్య, శ్రీనివాస్, మహేష్, కరాటే కృష్ణ పాల్గొన్నారు.

కంటి వైద్య పరీక్షల కోసం ఎంపిక



నవతెలంగాణ-నంగునూరు

కంటి ఆపరేషన్ కోసం అవసరమైన వారిని ఎంపిక చేయడం జరిగిందని ఎంపీటీసీ బెదురు తిరుపతి పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కాశీనాథ్ ఆదేశాల మేరకు మంగళవారం నంగు నూరు మండలం గట్లమాల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని సిద్దన్నపేట గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో గుర్తించిన వారిని త్వరలోనే ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంగు పురేందర్, అఫ్తాల్మిక్ ఆఫీసర్ భద్రయ్య, హెల్త్ అసిస్టెంట్ భాస్కర్ బట్ల, ఆశాలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పాము వంకలను తలపిస్తున్న డివైడర్

- పెండింగులో కోట మైసమ్మ రోడ్డు
- అధికారులు నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనం

నవతెలంగాణ-గజ్వేల్

పట్టణంలోని ఇందిరాపార్క్, కోట మైసమ్మ రోడ్డు పెండింగ్‌లో ఉండటం వల్ల స్థానిక ప్రజలకు నివాస గృహాలకు తలకు మించిన భారంగా మారింది. స్థానిక ఢిల్లీ వాలా హోటల్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు రోడ్డు పూర్తి చేసి ఎంపీడీవో కార్యాలయం నుంచి కోర్టు కేసుల పేరిట ఆర్‌అండ్‌బి అధికారులు రోడ్డును వేయకుండానే వదిలేశారు. మురికి కాలలు నిర్మించలే కపోయారు. మురికి కాలువలో మురికి నీరు ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిలిచింది. దీంతో సమీప నివాస గృహాలకు జబ్బులు వచ్చే అవకాశం ఉంది. ఆర్ అండ్ బి అధికారులు, కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేపట్టినట్లు స్థానికులు మండిపడుతున్నారు. గతంలో పనిచేసిన ప్రజాప్రతినిధులు, ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ కరువైంది. కాంట్రాక్టర్, అధికారులు చేతులు దులుపుకోవడంతో అక్కడ నివసిస్తున్న ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. ఇప్పటికే ఏడు సంవత్సరాలుగా ఈ రోడ్డు నిర్మాణం జరుగుతుంది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు రోడ్ల విస్తరణ విషయంలో పట్టించుకోలే



కపోయారు. దీంతో ఇష్టారాజ్యంగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. రోడ్డు విస్తరణలో ఇల్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం ఆదుకోలేకపోయింది. సుమారు 160 మంది బాధితులు ఉండగా 35 మంది వరకు డబుల్ బెడ్ రూమ్‌లో అవకాశం ఇచ్చారు. వారికి కూడా సరైన పట్టాలు అందించలేక పోయారు. అప్పటి ప్రభుత్వంలో కీలక పదవుల్లో ఉన్న నాయకులు గజ్వేల్ అభివృద్ధి ముఖ్యంగా రోడ్ల విస్తరణ విషయంలో దృష్టి పెట్టలేదు. కాంట్రాక్టర్ అధికారులు కలిసి ఇందిరాపార్కు, కోట మైసమ్మ రోడ్డు విస్తరణ చేశారు. ఇండ్ల తొలగింపు మున్సిపల్ శాఖ చేపట్టి ఇల్లు కోల్పోయిన బాధితులకు న్యాయం జరగాలని ప్రతిపక్షం సైతం ధర్నాలు రాస్తారోకోలు చేశారు. ఇందులో సీపీఎం పార్టీ ముందుండి రోడ్డు విస్తరణలో ఇల్లు కోల్పోయిన వారిని ఆదుకోవాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించింది.

అధికారుల నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనం

స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి కోట మైసమ్మ వరకు ఏర్పాటు చేసిన డివైడర్ పాము వంకల మారింది. డివైడర్ సూటిగా నిర్మించేందుకు స్థలం ఉన్నప్పటికీ ఆ రెండు రోడ్లు నిర్మించేందుకు స్థలం ఉన్నప్పటికీ ఆర్‌అండ్‌బి అధికారులు పట్టించుకోకుండా పైన పైన పర్యవేక్షణ చేసి వదిలివేశారు. కాంట్రాక్టర్ సారంగా పాము వంకలు మాదిరిగా డివైడర్ ఏర్పాటు చేసి వదిలివేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉదయం రాత్రి ద్విచక్ర వాహనాలు, బస్సులు రాకపోక సాగిస్తున్న తరుణంలో డివైడర్ పాము వంకలుగా ఉండటం వల్ల ఎక్కడ వెళ్లాలో ఎక్కడ మలుపు తీసుకోవాలో ప్రజలకు తెలియడం లేదు. స్థానిక ప్రజలు అనేకసార్లు అధికార దృష్టికి తీసుకుపోయిన ఫలితం లేకపోయింది. ప్రస్తుతం కోట మైసమ్మ రోడ్డులో నివసిస్తున్న ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకుపోయిన నిర్లక్ష్యం చేశారని విమర్శలు ఉన్నాయి. ఇండ్ల తొలగింపులో బాధితులకు ఇల్లు కేటాయించి రోడ్డు పూర్తి చేయాలని అనేకసార్లు స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టికి ఆ కాలనీ ప్రజలు విజ్ఞప్తి చేసిన ఫలితం లేకపోయింది. కోట్లాది నిధులు పెట్టి వంకర టింకర చేశారు. గతంలో గజ్వేల్ ఇంచార్జిగా పనిచేసిన మంత్రి హరీశ్‌రావు ఒక్కసారి కూడా రోడ్డు పనులను పరిశీలించలేకపోయారు. హరీశ్‌రావు పరిశీలిస్తే రోడ్డు దుస్థితి ఇలా ఉండేది కాదని స్థానికులు వాపోతున్నారు.



గజ్వేల్ మట్టి బిడ్డకు దక్కిన గౌరవం

- గజ్వేల్ ప్రజలకు అందరికీ సంతోషం
- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మట్టి బిడ్డకు బిగ్‌బాస్ షో ద్వారా దక్కిన గౌరవం గజ్వేల్ ప్రజలందరికీ సంతోషంగా ఉందని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం గజ్వేల్ మండలం కొలుగురు గ్రామానికి చెందిన పల్లవి ప్రశాంత్ ఇటీవల జరిగిన టీవీషో బిగ్‌బాస్ సీజన్ 7లో విన్నర్‌గా గెలిచినందుకు మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ వారిని శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ గజ్వేల్ నుంచి బిగ్బాస్ షోలో పాల్గొని ఈ రెండు తెలుగు రాష్ట్రాల్లో గజ్వేల్ మట్టి బిడ్డగా ఈ ప్రాంతానికి గొప్ప పేరు తీసుకురావడం గర్వించదగ్గ విషయ మన్నారు. రైతుబిడ్డగా పుట్టి ఒక సామాన్య యువకుడు తలుచుకుంటే సాధ్యం కానిదంటూ ఏమి ఉండదని ప్రశాంత్ నిరూపించారన్నారు. ఇంకా ఇక్కడే ఆగకు ండా జీవితంలో మరింత పేరుప్రఖ్యాతులు సంపాదించి మంచి పేరు తెచ్చుకో వాలని ఆకాంక్షించారు. యూత్‌కి ఒక ఐకాన్‌గా ప్రశాంత్ నిలిచారన్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌ని, వారి తల్లిదండ్రుల్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు మండల మాజీ అధ్యక్షులు మద్ది రాజిరెడ్డి, కొలుగురు ఎంపీటీసీ జ్యోతి స్వామి, బీఆర్ఎస్ నాయకులు రమేష్ గౌడ్, అహ్మద్, నరేష్ గౌడ్, నిజామోద్దీన్,



పురం ఆంజనేయులు, కొండల్ రెడ్డి, పురం అనిల్, వడ్ల నరేష్ పాల్గొన్నారు.

నర్సారెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యక్రమాలు

- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

నవతెలంగాణ-గజ్వేల్

ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన కాంగ్రెస్ నేతలే ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహిస్తారని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సోమవారం నిర్వహించిన పీఏసీ కమిటీలో నిర్ణయాల ప్రకారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలోనే ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆయా జిల్లాల కలెక్టర్లకు ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. గజ్వేల్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గెలిచినప్పటికీ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం రావడం తో ఇక్కడ అధికార పార్టీ నేతలే ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహిస్తారని తెలిపారు. నియోజకవర్గంలోని తొమ్మిది మండలాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు నర్సారెడ్డి ముఖ్య పాత్ర పోషిస్తారని సీఎం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలో నర్సారెడ్డి ఇచ్చే సమాచారంతోనే కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం స్థానిక అధికారులను సూచించింది. నర్సారెడ్డికి సమాచారం ఇవ్వకుండా ఏ ఒక్క కార్యక్రమం నిర్వహించకూడదని ఉన్నత అధికారులకు సీఎం ఆదేశాలు ఇచ్చారు. ఈ నెల 28 నుంచి జరగనున్న గ్రామసభలను నర్సారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగే ప్రతి కార్యక్రమానికి ముందుగా ఉండి ప్రభుత్వ పథకాలను అమలు అయ్యేలా చూడాలని నర్సారెడ్డికి సీఎం సూచించారు. సోమవారం రాత్రి మాజీ ప్రజా ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. త్వరలోనే నామినేటె పదవులు కార్పొరేషన్ పదవులను భర్తీ చేసుకు ందామని స్థానిక నేతలకు సూచించారు. రాష్ట్రం లో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూము కుంట నర్సారెడ్డికి కీలక పదవి వచ్చే అవకాశం ఉందని తెలుస్తుంది. అంతే కాకుండా ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డిని నర్సారెడ్డి కోరినట్లు సమాచారం. గజ్వేల్ నియోజకవర్గంలో అనేక పనులు పెండింగ్‌లో ఉన్నాయని ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగంగా పెండింగ్‌లో ఉన్న పనులపై దృష్టి పెట్టాలని స్థానిక ప్రజలు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిని కోరుతున్నారు.



అమరులైన పోలీసులు ప్రజల గుండెల్లో నిలిచారు

హుస్నాబాద్ ఎస్ఐ తోట మహేష్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

విధి నిర్వహణలో అమరుడైన ఎస్సై జాన్ విల్సన్ హుస్నాబాద్‌లో పని చేసిన కొద్ది కాలమైన ప్రజల మనిషిగా ప్రజల గుండెలో చిరస్థాయిగా నిలిచి పోయారని ఎస్సై మహేష్ అన్నారు. మంగళవారం హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ ముందు 1991లో నక్సల్స్ అమర్చిన మందు పాతర పేలి విధి నిర్వహణలో అమరులైన సిఐ యాదగిరి, ఎస్సై జాన్ విల్సన్‌ల 32వ వర్ధంతి కార్యక్రమాన్ని జాన్ విల్సన్ సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పోలీస్ అధికారులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని సీఐ యాదగిరి చిత్రపటానికి, ఎస్సై జాన్ విల్సన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. పేద వృద్ధ మహిళలకు, చీరలు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహేష్ మాట్లాడుతూ 32 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ అమరులైన పోలీసుల పేరిట హుస్నాబాద్ ప్రాంతంలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం గొప్ప విషయమన్నారు. విధి నిర్వహణలో ఎస్సై జాన్ విల్సన్, సీఐ యాదగిరిలు చూపించిన నిబద్ధతను ఆదర్శంగా తీసుకొని నేడు విధి నిర్వహణలో పోలీసులు ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రానికి చెందిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి పురుషుల పొదుపు సంఘం సభ్యుడు ఐలేని మహేందర్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం పొదుపు సంఘం ఆధ్వర్యంలో సంఘం సభ్యులు మృతుని కుటుంబ సభ్యులకు రూ.2 వేలు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసిన వారికి గుర్తింపు

- ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-కొండపాక

ఉద్యోగ విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన వారికి ఎప్పటికీ గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ శ్రీనివాసరెడ్డి అన్నారు. కొండపాక మండలం దుద్దెడ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు లక్ష్మీ అధ్యక్షతన మంగళవారం ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ బదిలీ అనేది ఉద్యోగంలో సాధారణమైనప్పటికీ ఈ పాఠశాలలో పనిచేసిన ముగ్గురు ఉపాధ్యాయులు వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేయడం అభినందనీయమన్నారు. బదిలీపై వెళ్లిన పాఠశాలలో కూడా ఇదే స్ఫూర్తితో పనిచేయాలని ఆకాంక్షించారు. అనంతరం టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీ.యాదగిరి, డిటీఎఫ్ జిల్లా నాయకులు బి.చంద్రభానులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు అందించిన సేవలను గుర్తు చేశారు. బదిలీపై వెళ్లిన



ఉపాధ్యాయులు యస్. పద్మారెడ్డి, ఆర్. విజయలక్ష్మి, ఎల్వి శ్రీనివాస్‌లను పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-జగదేవపూర్

అధికారులు ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఎంపిపి బాలేశం గౌడ్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ బాలేశం గౌడ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వివిధ శాఖల అధికారులు వారి నివేదికలను సభలో చదివి వినిపించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ తిగుల్ సర్పంచ్ కప్పర భాను ప్రకాష్ రావు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని ఎంపీపీ బాలేశం గౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ పీర్లపల్లిలో వ్యవసాయ సాగు కోసం విద్యుత్ సరఫరాను నిలిపివేసి రైతులను ఇబ్బం దులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బాలేశం గౌడ్, జడ్పీటీసీ సుధాకర్ రెడ్డిలు మాట్లాడుతూ వెంటనే విద్యుత్ సమస్యపై మూడు రోజులు గడువు ఇవ్వాలని ఎంపీపీ సూచించారు. గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని సూచించారు. అలాగే పలు గ్రామాల సర్పంచులు గతంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించాలని కోరారు. జగదేవపూర్ గ్రంథాలయం నూతన భవన నిర్మాణం కోసం 50 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ సమావేశంలో పిఎసిఎస్ చైర్మన్ ఆలేటి ఇంద్రసేనారెడ్డి, తాసిల్దార్ శ్రవణ్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్ వర్మ, ఎంఈఓ ఉదయభాస్కర్ రెడ్డి ఎంపీటీసీలు కవిత శ్రీనివాస్ రెడ్డి, మంజుల మహేందర్ రెడ్డి, కిరణ్ గౌడ్, మహేందర్ రెడ్డి ,మహేష్, సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షుడు రాచర్ల నరేష్, సర్పంచ్ లు చంద్రశేఖర్, భాను ప్రకాష్ రావు, యాదవరెడ్డి, కనకయ్య, వెంకట్రాంరెడ్డి, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

నవతెలంగాణ-రాయపోల్

గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో గ్రామం అభివృద్ధికి నోచుకోలేదని వీరారెడ్డి పల్లి కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు పాపని ఆంజనేయులు అన్నారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు వీరారెడ్డిపల్లి కాంగ్రెస్ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయపోల్ మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ 10 సంవత్సరాల పాలనలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా నిధులు మంజూరు చేసి గ్రామాభివృద్ధికి సహకరించాలన్నారు. అనేక సమస్యలు పేరుకపోయి గ్రామ అభివృద్ధి కుంటుపడిందన్నారు. వీరారెడ్డి పల్లి గ్రామం నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడినప్పటికీ అభివృద్ధి నోచుకోలేదన్నారు. గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయని, గత పాలకులు ఎవరు కూడా గ్రామ అభివృద్ధికి పాటుపడలేదన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికలలో బీఆర్ఎస్ పాలనకు ప్రజలు చరమగీతం పాడి కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పాలనలోనైనా వీరారెడ్డిపల్లి గ్రామం అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నామన్నారు. వీరారెడ్డిపల్లి గ్రామంలో సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, బీసీ కమ్యూనిటీ హాల్, త్రాగు నీటి సమస్యలు ఉన్నాయని వీటి పరిష్కారం కోసం జిల్లా మంత్రిగా నిధులు మంజూరు చేసి గ్రామ అభివృద్ధికి సహకరించాలన్నారు. దీనికి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సానుకూలంగా స్పందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వీరారెడ్డి పల్లి కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శాతం రాములు, నాయకులు బోనగిరి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అందుబాటులో రుణ సౌకర్యం

పీఏసీఎస్ చైర్మెన్ లింగల రాజలింగ రెడ్డి



నవతెలంగాణ-మిరుదొడ్డి

రైతులకు అందుబాటులో రుణాలు అందించడానికి పీఎసీఎస్ కార్యాలయంలో వారికి రుణాల అందించడం జరుగుతుందని పీఏసీఎస్ చైర్మన్ లింగాల రాజలింగ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రైతులకు వివిధ రుణాలు అందించారు. అందె గ్రామానికి చెందిన శంకర్, బాగవ్వ లకు బర్లు, మేకల పెంపకంకోశం ఒక్కక్క యూనిట్‌కు రూ.5 లక్షలు, రూ.10 లక్షలను దుబ్బాక బ్రాంచ్ మేనేజర్ మహేందర్ రెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైతులు ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాలో రైతుబంధు వేయాలి



నవతెలంగాణ-మద్దూరు : రైతుల ఖాతాలో రైతుబంధు వెంటనే వేయాలని సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుల ఖాతాల్లో రైతుబంధు వేస్తామని చెప్పి ఇప్పటివరకు రైతుబంధు వేయడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు భరోసా పేరుతో ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు రైతు భరోసా పెట్టుబడి సాయం రైతుల ఖాతాలో వేయడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం మాదిరిగానే రైతుబంధు నిధులు విడుదల చేస్తున్నామని చెప్పి ఎకరంన్నర లోపు భూమి ఉన్న రైతులకు మాత్రమే రైతుబంధు వచ్చిందని, మిగతా రైతులకు ఇప్పటివరకు రైతుబంధు రాలేదన్నారు. ప్రభుత్వం వెంటనే రైతుబంధు నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. లేనిపక్షంలో రైతులను ఏకం చేసి ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు.

పీహెచ్ఈయూ డివిజన్ నూతన కార్యవర్గం ఏర్పాటు



నవతెలంగాణ-గజ్వేల్

పబ్లిక్ హెల్త్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గజ్వేల్ డివిజన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం వారు పలు డిమాండ్లపై చర్చించారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న పారా మెడికల్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే ఇవ్వాలన్నారు. పిఆర్సిని వెంటనే అమలు చేసి, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపిసి విధానాన్ని అమలు చేయాలని వారు కోరారు. పీహెచ్‌సీలలో అధికారుల వేధింపులు ఆపి పని వత్తిడి తగ్గించాలన్నారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, అర్హత గల వారికి పదోన్నతులు కల్పించాలన్నారు. ఉద్యోగస్తులందరికీ ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు వచ్చే విధంగా చూడాలన్నారు.

అధ్యక్షులుగా నారాయణ

గజ్వేల్ డివిజన్ నూతన అధ్యక్షులుగా ఏ. నారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా దేవసాని వాసుదేవ్, కోశాధికారిగా జీ. మంగ, సంయుక్త కార్యదర్శులుగా డి.నాగరాజు, సుజాత, ప్రజ్ఞాపూర్ బి. నిరూప. ఎండి షకీల్. మల్లేశం బాలకిషన్ (యుడిసి), సలహదారులుగా తిరుపతి రెడ్డి, సురేష్ కుమార్, ప్రభాకర్ వర్గల్ నరేష్, కార్యనిర్వహక కార్యదర్శిగా ఎం.ప్రేమ నీరజ, డి.సరస్వతి, అసోసియేట్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కొరివి కృష్ణ స్వామికి నివాళులు



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని గ్రీన్ కాలనీ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కొరివి కృష్ణ స్వామి 56వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కొరివి కృష్ణస్వామి సేవాసమితి జిల్లా ఇంచార్జ్ శ్రావణ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొరివి కృష్ణ స్వామి హైదరాబాద్ తొలి మేయర్‌గా బాధ్యతలు చేపట్టారన్నారు. ఆయన ఆధ్వర్యంలోనే హైదరాబాద్ నగరానికి ఒక మాస్టర్ ప్లాన్ అందించారని తెలిపారు. అనేక పత్రికలను, అనేక పుస్తకాలను ముద్రించి సమాజానికి అందించారని, మొట్టమొదటిసారిగా ముదిరాజ్ మహాసభను ఏర్పాటు చేసి ముదిరాజ్ సమాజాన్ని ఏకం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో, జంగిటి శ్రీనివాస్, ముదిరాజ్ మరియు గ్రీన్ కాలనీ సంఘం అధ్యక్షులు ఇప్ప నర్సింలు, సభ్యులు జిల్లెల్ల సుధాకర్, సుతారి రాజు, పడిగే ప్రశాంత్, గొడుగు శ్రీనివాస్ పిట్ల రాజన్న, బైరయ్య, యాదగిరి, నాగేంద్ర, అర్జున్, దివిటి రాయిని సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు ప్రధాన కాలువలో చెట్లు తొలగించాలి

అడిషనల్ కలెక్టర్ గరీమ అగర్వాల్



నవతెలంగాణ-అక్కన్నపేట

మండలంలోని గౌరవెల్లి ప్రాజెక్టు ప్రధాన కాలువను జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె కాలువను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గౌరవెల్లి ప్రాజెక్టు ప్రధాన కాలువలో విపరీతంగా చెట్లు పెరిగాయని, వాటిని ఈజీఎస్ కూలీల ద్వారా తొలగించాలని తెలియజేశారు. ఆదే విధంగా గౌరవెల్లిలోని నర్సరీని పరిశీలించారు. జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలోకి వెళ్లి పిల్లలతో మాట్లాడారు, స్కూల్ టాయిలెట్లు పూర్తి కాకపోవడంతో వాటిని త్వరగా పూర్తిచేసి పిల్లలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం అంతకపేట ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, డిఎల్పిఓ వీరభద్రయ్య, ఇరిగేషన్ ఈఈ రాములు నాయక్, ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి, ఏపీడి ఓబులేసు, ఏపీవో ప్రభాకర్, టిఏ ఉమేష్, పంచాయతీ సెక్రెటరీ నిర్మల, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

టీబీ జయించిన వ్యక్తిని సన్మానించిన వైద్య సిబ్బంది



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని రేబర్తి గ్రామానికి చెందిన డాకూరి పాపిరెడ్డి గత ఆరు నెలలుగా టీబీ మాత్రలు వాడి టీబి వ్యాధిని జయించడంతో అతన్ని మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో వైద్య సిబ్బంది ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్, పల్లె దావకాన డాక్టర్ ప్రతిభ, ఏఎన్ఎం మలవోత్రి, తదితరులు పాల్గొన్నారు.

ఆశతో రాలేదు..ఆశయం కోసం వచ్చా

- విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- నియంత పాలనకు స్వస్తి పలకడం సంతోషకరం
- ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ప్రజల కోసమే సేవచేస్తామని హామీ
- ఎన్నికల్లో ప్రజా తీర్పుకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే





నవతెలంగాణ-బెజ్జంకి

వృత్తిరీత్యా ప్రజలకు వైద్య సేవ చేశానని, ప్రజలకు తన వంతు సేవ చేసి చిరస్థాయిలో నిలిచే విధంగా రాజకీయాలకు వచ్చానని మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికై మొదటిసారి మండల కేంద్రానికి విచ్చేసిన కవ్వంపల్లి సత్యనారాయణకు మంగళవారం పార్టీ కార్యాలయం వద్ద మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గజమాల వేసి పుష్పగుచ్చం అందించి శాలువా కప్పి ఘన స్వాగతం పలికారు. పార్టీ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ఒగ్గుడోలు, డప్పు చప్పుల్లతో బాణసంచాలు, టపాసులు కాల్చుతూ కాంగ్రెస్ శ్రేణులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే సత్యనారాయణ స్థానిక అంబేద్కర్ విగ్రహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్ర ప్రజలు నిర్బంధమైన జీవనం సాగించిందన్నారు. గోప్యంగా సాగించిన బీఆర్ఎస్ ప్రభుత్వ నియంత పాలనకు రాష్ట్ర ప్రజలు తమ తీర్పుతో స్వస్తి పలికడం సంతోషకరమని ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య ప్రభుత్వమైన కాంగ్రెస్ పార్టీకి పరిపాలన అధికారం కట్టబెట్టారని ప్రజా తీర్పును శిరసవహించి ప్రజా సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రజలకు అందించాల్సిన సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు దోచుకున్నారన్నారు. మళ్లీ అలాంటి దుస్థితి తలెత్తకుండా అర్హులైన ప్రజలకు అందిస్తానన్నారు. అక్రమణకు గురైన ప్రభుత్వ భూములపై అధికారులతో చట్టపరమైన విచారణ చేపట్టి అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేస్తామన్నారు. అక్రమ నిర్మాణాలను తొలగించేలా కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో రెండు గ్యారంటీలు అమలవుతున్నాయని, కొద్ది రోజుల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని ప్రజలు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడానికి ఎళ్లవేళల అందుబాటులో ఉంటానని సూచించారు. అనంతరం ఎమ్మెల్యేగా ఎన్నికై మొదటిసారి మండల కేంద్రానికి విచ్చేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో శాలువ కప్పి ఘనంగ సన్మానించారు. పాస్టర్స్ భోష ప్రభుదాస్, ప్రభాకర్, బోయిని ప్రసన్న కుమార్, పర్వతం చంద్రం, మండలాధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యకుడు ఒగ్గు దామోదర్, ఉపాధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ అక్కవేణి పోచయ్య, మండలాధికార ప్రతినిధి జనాగం శంకర్, నాయకులు మంకాల ప్రవీన్, శానకొండ శ్రవణ్,మిట్టపల్లి చెన్నారెడ్డి, రొడ్డ మల్లేశం, చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, ఐలేని శ్రీనివాస్ రెడ్డి, మానాల రవి,దోనే వెంకటేశ్వర్ రావు, మెట్ట నాగారాజు పోతిరెడ్డి మధుసూదన్ రెడ్డి, శెట్టి రాజు, జెల్లా ప్రభాకర్, మాజీ సర్పంచులు చెప్యాల శ్రీనివాస్, రావుల నర్సయ్య, కవ్వంపల్లి యువసేన అధ్యక్షుడు కత్తి రమేశ్, అయా గ్రామాల కాంగ్రెస్ శ్రేణులు హజరయ్యారు.

గ్రామ పంచాయతీ కార్మికుల వినతి..

జీవో 51ను రద్దు చేసి కనీసం రూ.21వేలు వేతనం అందించి, ఆరోగ్య వసతులు కల్పించాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు మండల గ్రామ పంచాయతీ కార్మికులు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ పాలనలో నిరవధిక సమ్మెలు చేయగా సమస్యను పరిష్కరిస్తామని మోసం చేసి ందని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించేల సత్వర చొరవ చూపాలని పంచాయతీ కార్మికులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ దృష్టికి తీసుకువేళ్తానని ఎమ్మెల్యే సూచించారు.

విజయంతో మొక్కులు చెల్లించిన ఎమ్మెల్యే

మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా విజయం సాధించిన కవ్వంపల్లి సత్యనారాయణకు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బండారి రాములు, ఆర్చకులు మధు సూధన చారి వేద మంత్రాలతో పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయ ప్రవేశ మెట్ల వద్ద ఎమ్మెల్యే కవ్వంపల్లి కొబ్బరికాయలు కొట్టి మొక్కు లు చెల్లించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువ కప్పి సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభించిన ఎమ్మెల్యే..


మండల కేంద్రంలోని స్థానిక మినీ స్టేడియంలో బెజ్జంకి క్రికెట్ అసోసియేషన్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీ ని సర్పంచ్ ద్యావనపల్లి మంజుల, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. క్రికెట్ టోర్నీలో పాల్గొంటున్న క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి విజయవంతంగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వినో ద్ బాబ్జీ, కొండయ్య ఆశా కార్యకర్తలు వెంకటలక్ష్మి, సౌమ్య రేణుక, రజిత, భాగ్యలక్ష్మి ఎమ్మెల్యేకు శాలువ కప్పి సన్మానించారు.



పాలన ప్రజలకు చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యం

నవతెలంగాణ-చిన్నకోడూరు

పాలన ప్రజలకు చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అజ్జు యాదవ్ అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో ప్రజల ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్‌లో తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని దాదాపు 5000 పైచిలుకు సమస్యల దరఖాస్తులు ప్రజల ద్వారా అందుకున్నారన్నారు. అందులో భాగంగా శనిగరం చెరువు ద్వారా నష్టపోతున్న చిన్నకోడూరు మండల ప్రజల పక్షాన వినతి పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అజ్జు యాదవ్ మాట్లాడుతూ ఒకప్పుడు కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు, మంత్రులు, వారికి నచ్చిన కొంతమంది ఎమ్మెల్యేలు, అధికారులకు మాత్రమే ప్రవేశముండే చోటు ప్రగతి భవన్ (జ్యోతిరావు పూలే ప్రజాభవన్) నేడు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి ఒక్కరికీ జ్యోతిరావు పూలే ప్రజాభవన్లో అందరికీ ప్రవేశం కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా శనిగరం చెరువు బాధితుల పక్షాన నిలబడి మండల స్థాయి నుంచి జిల్లా అధికారులను కలిసినా, ప్రస్తుత ఎమ్మెల్యే హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో సమస్యను తెలుసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత అధికారులకు సమాచారం అందిస్తూ, దానికి పరిష్కారం చేసే విధంగా అడుగులు వేసి ప్రతి బాధితుడికి న్యాయం చేసే బాధ్యత తీసుకుం టామని హామీ ఇచ్చారన్నారు. మంత్రి పొన్నం ప్రభా కర్ మా గ్రామాల ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచు కొని న్యాయం చేస్తారని విశ్వాసం వ్యక్తం వ్యక్తం చేశారు.



గురుకుల హాస్టల్‌లో దుర్వాసన



నవతెలంగాణ-మిరుదొడ్డి

గురుకుల పాఠశాలలో విద్యార్థులకు దుర్వాసన వెదజల్లుతుంది. ప్రతిరోజు వంట గది పక్కన నీరు నిల్వ ఉండడంతో విద్యార్థులకు, రోడ్డుపైన వెళ్లే ప్రయాణికులకు పూర్తిగా దుర్వాసన రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని చెప్యాల చౌరస్తాలోని గురుకుల హాస్టల్ ఎదుట దుర్గంధం వెదజల్లుతుంది. హాస్టల్లో ఉన్నటువంటి మురికి నీరు, బస్టాండ్ ఆవరణలో ఉన్నటువంటి మురికి కాలువలో నిల్వ ఉండడంతో దుర్గంధంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజలు వాపోతున్నారు. గురుకుల హాస్టల్‌లో ఉన్నటువంటి మురికి నీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రయాణికులు వాహనదారులు కోరుతున్నారు. బస్సు షెల్టర్ వద్ద ప్రయాణికులు నిల్చోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఇదే విషయంపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దుర్గంధం రాకుండా మూరికి నీరు నిలువ లేకుండా చూడాలని కోరుతున్నారు. లేదంటే ప్రయాణికులు వాహనాదా రులతో పాటు హాస్టల్లో ఉన్న విద్యార్థులకు కూడా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు.

సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-మద్దూరు

ఈనెల 21, 28 తేదీల్లో సిద్దిపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించే సదరం శిబిరాన్ని వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని లద్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్టువర్ట్సన్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ డీఆర్డీఏ ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో డిసెంబర్ 21, 28 తేదీలలో సదరం క్యాంపు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సదరం క్యాంపుకు వచ్చే వారు ఆన్లైన్లో స్లాట్ బుక్ చేసుకొని ఫారం ఏ నమోదు చేయించుకొని రసీదు, ఆధార్ కార్డు, ఫోటో ఇది వరకు డాక్టర్లు పరిశీలించిన రిపోర్ట్స్ స్కానింగ్ ఎక్స్‌రే కాపీలు తీసుకొని వెళ్లాలని ఆయన కోరారు.

దుబ్బాకలో రింగ్ రోడ్డు

- అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ-మిరుదొడ్డి

దుబ్బాక నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు, నూతన రోడ్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్ అండ్ బీ శాఖ అధికారులను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశించారు. నియోజకవర్గంలోని మంజూరైన రోడ్ల అభివృద్ధి పనులను, అలాగే కొత్త రోడ్ల మంజూరు కోసం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాకలో ట్రాఫిక్ దృశ్యా దుబ్బాక చుట్టూ రింగ్ రోడ్డు వేసి సమస్య పరిష్కారం చేసుకోవడం జరుగుతుందన్నారు. దుబ్బాక మండల హబ్సిపూర్ నుంచి దుబ్బాక వరకు డబల్ రోడ్ ను ఫోర్ లైన్ రోడ్‌గా, మిరుదొడ్డి మండలంలోని అందె గ్రామం నుంచి దుబ్బాక మండలంలోని తిమ్మాపూర్ వరకు డబల్ రోడ్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. నియోజకవర్గంలోని ఆయా మండలాలలో జరుగుతున్న రోడ్ల పనులను అడిగి తెలుసుకున్నారు. దశల వారీగా నియోజకవర్గంలో రోడ్ల సమస్యలను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. సమీక్షలో ఆర్అండ్ బి ఇఇ బాలప్రసాద్, దుబ్బాక డీఇ వెంకటేశం, దౌల్తాబాద్ ఏఇఇ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య

నవతెలంగాణ-గజ్వేల్

పట్టణంలో అర్హులందరికీ సమగ్రంగా సర్వే నిర్వహించి ఇందిరమ్మ డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాదులోని జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో ప్రజావాణిలో వ్యక్తిగత దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టిఆర్ఎస్ ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని సర్వే చేసి కాలయాపన చేసిందని విమర్శించారు. పట్టణంలో సుమారు 30 సంవత్సరాల నుంచి కిరాయి ఉండి స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారన్నారు. పెరుగుతున్న ధరలతో ఇంటి కిరాయిలు కట్టలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం 6 గ్యారంటీల పథకంలో భాగంగా ఇందిరమ్మ డబుల్ బెడ్ రూమ్‌లో ఇవ్వాలని వెంటనే సమగ్రంగా సర్వే నిర్వహించాలని గజ్వేల్ పట్టణవాసులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్థలం ఉన్నవారికి ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే పథకం ప్రారంభించి ప్రజలకు లబ్ది కలిగే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పద్మ నరసింహులు కవిత, లక్ష్మి, మహేందర్, సంపత్ యాదగిరి, సత్తయ్య, అరుణ, మంజుల పాల్గొన్నారు.



పెండింగ్ బిల్లులు, డీఏలు విడుదల చేయాలి

నవతెలంగాణ-కొండపాక

విద్యారంగ ఉపాధ్యాయ సమస్యలను నూతన ప్రభుత్వం పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయేందర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎస్ కనకయ్య కోరారు. టీపీటీఎఫ్ కొండపాక మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని వివిధ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమంతో పాటు సమస్యలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యా రంగా సమస్యలు పరిష్కరించాలని, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్స్ పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ప్రమోషన్లకు అర్హత అయిన టెట్ ను మినహాయింపు ఇవ్వాలని క్వాలిఫై కావడానికి నిర్ణీత గడువు ఇచ్చే విధంగా ఉత్తర్వులు ఇచ్చి ప్రమోషన్లు , బదిలీలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా ఇటీవల ఉపాధ్యాయులు బదిలీ ఉత్తర్వులు పొంది రిలీవ్ కాని ఉపాధ్యాయులను ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి రిలీవ్ చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ ఎన్, ఉన్నత పాఠశాలలో ఉన్నతి కార్యక్రమాల వలన ఉపాధ్యాయులకు పేపర్ వర్క్ ఎక్కువ ఉండడంతో తరగతి గదిలో బోధనకు ఆటంకం కలుగుతున్నదన్నారు. పై రెండు ప్రోగ్రాంలను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ సీనియర్ నాయకులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొన్నమల్ల రాములు, జి. తిరుపతి రెడ్డి, కే.రామస్వామి, కే.కనకయ్య, రామచంద్రం, శంకర్ కనకయ్య, వెంకటయ్య, డి.రాములు, అంజయ్య, లక్ష్మారెడ్డి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

